## క్లుప్తంగా

### రేపు మల్లయ్యకొండ హుండీ ఆదాయం లెక్కింపు

**తంబళ్లపల్లె:** మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదియం లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ, కొండకిట్ట తెలిపారు. మూడు మాసాలుగా భక్తులు స్వామికి హుండీ ద్వారా చెల్లించిన కానుకలను లెక్కిస్తారన్నారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

**కలికిరి(వాల్మీకిపురం):** వాల్మీకిపురం పట్టణ పరిధిలోని జెట్టిపాళెం వీధికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం రెడ్డెప్ప భార్య శకుంతలమ్మ ఇటీవల మరణించారు. ఆదివారం వారి స్వగృహం వద్ద జరిగిన ఆమె దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తోటవీధికి చెందిన రాగల ఎల్లమ్మ ఇటీవల మృతి చెందగా ఆదివారం ఆమె దశదినకర్మ కార్యక్రమానికి హాజరై ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అలాగే అయ్యవారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డెప్ప రెడ్డి, యల్లారెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం మండల కార్యదర్శిగా నియమితులైన నల్లంకి నాగేంద్రబాబు ఆదివారం వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ ప్రత్యేక ఆహ్వానితులు హరీష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శివకుమార్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, జర్రావారిపల్లి సర్పంచ్ భాస్కర తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.


### గ్రామ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక



కురబలకోట గ్రామ కార్యదర్శుల కార్యవర్గం

**కురబలకోట:** మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా కె. శేషగిరికుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కురబలకోటలో జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా అంగళ్లు కార్యదర్శి టి. ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలిగా యు. చంద్రకళ, ప్రధాన కార్యదర్శిగా ఎన్. రామప్ప నాయుడు, కోశాధికారిగా ఎస్.ఫిరోజ్, మీడియా ప్రతినిధిగా జి. నరేంద్ర సభ్యులుగా సి. రమణ, ఎస్. షబీనా, బి. నరసింహులు, బి.ప్రశాంతి, వి. పురుషోత్తమాచరి, వై. గురుమోహన్ ఎంపికయ్యారు

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మహల్ జెడ్పీ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

**కలికిరి:** మండలంలోని మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమవేశమయ్యారు. ఈ సందర్భంగా 35సంవత్సరాల తరువాత కలుసుకున్న అప్పటి విద్యార్థులు పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకుని విందు ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తామన్నారు.

### ఉన్మాదులను వెంటనే అరెస్టు చేయాలి

**రాయచోటి టౌన్ :** మదనపల్లె రూరల్ పరిధిలోని అంకిశెట్టిపల్లె గ్రామంలోని గొండపై వెలసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ధ్వంసం చేసిన తరువాత ఫిర్యాదు స్వీకరించాల్సిన పోలీసు అధికారులు నిమ్మకుండిపోవడం చూస్తుంటే కేసును నీరుగార్చడమేనన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు వంగిమళ్ల రమణ, న్యాయవాది రెడ్డెయ్య, ఎంవీ రమణ, పద్మావతి, ముత్యాల మోహన్ శంకర్ నాయక్, గౌస్ బాషా, రమేష్, శ్రీనివాసులు, సుధీర్, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# రెండునెలలుగా తాగునీటికి కటకటా



తాగునీటి కోసం ప్రజల అవస్థలు



వ్యవసాయబోర్ల వద్ద తాగునీరు పట్టుకొంటున్న మహిళలు

- మొటుకులో తాగునీటి బోర్లు ఎండిపోయిన వైనం
- ట్యాంకర్లతో తాగునీటి కొనుగోలు
- వ్యవసాయబోర్ల వద్దకు పరుగులు

**గుర్రంకొండ:** మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ మొటుకు, మొటుకు కాలనీ గ్రామాల్లో ప్రజలు, మహిళలు రెండునెలలుగా తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. గ్రామంలో ఉన్న తాగునీటిబోర్లు ఎండిపోయాయి. దీంతో ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటి కొనుగోలు చేసుకొవాల్సిన దుస్థితి నెలకొంది. డబ్బులు లేని వాళ్లు వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు.

**అడుగంటిన బోర్లు**

రెండు గ్రామాల పరిధిలో మొత్తం 200 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. 700 మంది జనాభా గ్రామాల్లో నివసిస్తున్నారు. రెండు నెలల క్రితం గ్రామంలో ఉన్న మూడు ప్రభుత్వ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటిపోయి పూర్తిగా ఎండిపోయాయి. అప్పటినుంచి ప్రజలకు, మహిళలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఒక ప్రభుత్వ బోరుకు సమీపంలో ఓ వ్యక్తి ప్రైవేట్ బోరు వేయడంతో అదికాస్తా ఎండిపోయింది. మరో పంచాయతీ బోరుకు రీబోర్ చేసినా చుక్కనీరు పడలేదు. దీనికి తోడు గ్రామంలో పశుసంపద, మేకలు, గొర్రెలు ఎక్కువగా ఉన్నాయి. వీటి దాహార్తి తీర్చడానికి పశువుల కాపరులు నానా తంటాలు పడుతున్నారు. పశువుల నీటి తొట్టి ఉన్నా పంచాయతీ బోర్లుఎండిపోవడంతో అవికుడా నిరుపయోగంగా మారాయి. కొత్త బోర్లు వేసి తాగునీరు ఇస్తారేమోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**ట్యాంకర్ నీరు రూ. 600**

తాగునీటి సమస్యతో మహిళలు, ప్రజలు తాగునీటి ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఒక ట్యాంకర్ నీరుకొనుగోలు చేయాలంటే రూ. 600 చెల్లించాల్సి వస్తొందని మహిళలు వాపోతున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు, పశుసంపద ఎక్కువగా ఉన్న కుటుంబాలకు తాగునీరు కొనుగోలు పెను భారంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్‌నీరు కొన్ని కుటుంబాలకు పదిరోజులకు కుడా సరిపోవడం లేదని వాపాతున్నారు. రెండునెలలుగా వేలాది రుపాయలు తాగునీరు కోసం ఖర్చు చేయాల్సి వస్తోందని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

**వ్యవసాయబోర్లే దిక్కు**

గుక్కెడు మంచినీరు కోసం మహిళలు వ్యవసాయబోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్న మహిళలు వ్యవసాయబోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సరఫరా ఉన్న సమయం కోసం వేచి చూస్తు కరెంటు వచ్చినప్పుడు వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి పలువురు తాగునీటిని తెచ్చుకొంటున్నారు. మరికొంత మంది గ్రామానికి సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న వ్యవసాయబోర్ల నుంచి పైపులైన్లు తీసుకొని ఇళ్ల వద్ద కొళాయిలు ఏర్పాటు చేసుకొంటున్నారు. తద్వారా వ్యవసాయానికి కరెంటు సరఫరా ఉన్న సమయంలో తాగునీరు తెచ్చుకొంటున్నారు. మొటుకు కాలనీ నివాసముంటున్న ప్రజలకు అక్కడ ఓ ఇంట్లో ప్రైవేట్ బోరు దాహార్తి తీరుస్తోంది. ప్రజల తాగునీటి కష్టాలు చూడలేక తన ఇంటి వద్ద బోరుకు కొళాయి కనెక్షన్ ఇచ్చి కొంత వరకు ప్రజల దాహార్తి తీరుస్తున్నాడు. రెండునెలలుగా తాగునీటి కోసం కష్టాలు పడుతున్నా పట్టించుకొనే వారు లేరని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

**కొత్తబోరు వేయిస్తాం**

మొటుకు గ్రామంలో కొత్త బోరుబావి తవ్వకం చేపడతాం. ఇటివలమండల మీట్‌లో కూడా సమస్యను సభ్యులు ప్రస్తావించారు. నిధులు అందుబాటులో ఉన్నాయి. రెండురోజుల్లో బోరు వేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తాం. **- పరమేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ**

## మహిళలకు రక్షణ కల్పించలేని కూటమి ప్రభుత్వం

- బీసీ మహిళలకు టీడీపీ ఇచ్చే గౌరవం ఇదేనా ?
- రాష్ట్రంలో దాడుల సంస్కృతిని ఆపండి
- అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు జి.షమీమ్‌అస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు షమీంఅస్లాం, మనూజారెడ్డి

**మదనపల్లె రూరల్ :** ఒక మహిళా ప్రజాప్రతినిధికి రక్షణ కల్పించలేని దిక్కుమాలిన కూటమిప్రభుత్వ పాలనలో ఉండటం రాష్ట్ర మహిళలందరికీ సిగ్గుచేటని ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు జి.షమీమ్‌అస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో... కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు చేసిన దాడికి చంద్రబాబు నేతృత్వంలోని కూటమిప్రభుత్వమే బాధ్యత వహించాలని వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షమీమ్‌అస్లాం మాట్లాడుతూ...గుడివాడలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ అనే కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక వెళుతుంటే... కారుపై టీడీపీ గూండాలు దాడిచేసి, అద్దాలు పగలగొట్టి, భర్త సమక్షంలోనే ఆమెపై దాడి చేసి అసభ్యపదజాలంతో దూషించి భయభ్రాంతులకు గురిచేసి బెదిరింపులకు పాల్పడటం శోచనీయమన్నారు. మహిళ హోంమంత్రిగా ఉన్న కూటమిప్రభుత్వంలో పోలీసుల సమక్షంలోనే ఒక బీసీ మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై పాశవికంగా దాడి జరిగిందంటే, ఈ రాష్ట్రంలో అసలు శాంతిభద్రతలు ఉన్నాయా అని ప్రశ్నించారు. మహిళలపై దాడి జరిగితే మొదట తానే స్పందిస్తానన్న పవన్‌కల్యాణ్ మౌనం దాల్చడమేంటని ప్రశ్నించారు. టీడీపీ బీసీల పార్టీ అంటూ గొప్పలు చెప్పుకునే వాళ్లు... బీసీ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం వచ్చాక టీడీపీ, జనసేన నాయకులు రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నారని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి సంస్కృతి ఎంతమాత్రం మంచిది కాదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ... బీసీ వర్గానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధి మీద దాడి జరిగితే సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి, డీజీపీ, మహిళా కమిషన్ ఇంతవరకు స్పందించకపోవడం దారుణమన్నారు. మహిళా నాయకురాలు వైజయంతి మాట్లాడుతూ...కూటమిప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ధృతరాష్ట్రపాలన, కీచకపర్వం కొనసాగుతోందని, ప్రతిరోజు ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా..లేక నియంతపాలనలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు ఎంపీటీసీ నీరుగట్టి మేరీ, కౌన్సిలర్ సింధలూరి రజని, శ్యామల, నాగమణి, అపర్ణ, అమ్మాజాన్, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

**షమీమ్‌అస్లాంకు అభినందనలు**

**మదనపల్లె రూరల్ :** ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్, అన్నమయ్యజిల్లా వైఎస్సార్ సీపీ మహిళావిభాగం అధ్యక్షురాలు గుండ్లూరు షమీమ్‌అస్లాంకు సామాజిక సేవా విభాగంలో డాక్టరేట్ వచ్చినందుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి ఆధ్వర్యంలో, నియోజకవర్గ మహిళా నాయకులు షమీం అస్లాంను దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. భారత్ విర్చువల్ యూనివర్సిటీ సామాజిక సేవావిభాగంలో ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో , కౌన్సిలర్ రజని, ఎంపీటీసీ నీరుగట్టి మేరీ, వైజయంతి, అపర్ణ, నాగమణి, శ్యామల, అమ్మాజాన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవం.. ఎల్లమ్మ జాతర మహోత్సవం



తేరుపై పురవీధులలో ఊరేగుతున్న ఎల్లమ్మ



దీలు, బోనాలు సమర్పిస్తున్న భక్తులు

- తేరుపై విహరించి భక్తులను కటాక్షించిన ఎల్లమ్మ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- భక్తిశ్రద్ధలతో దీలు, బోనాలు సమర్పణ

**కలికిరి:** కలికిరి గ్రామ దేవత శ్రీఎల్లమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు ఆదివారం అమ్మవారు నూతన తేరుపై విహరించారు. ఉదయం ఆలయం వద్ద నుంచి విశేష పుష్పాలంకరణ చేసిన నూతన తేరుపై బయల్దేరిన అమ్మవారు ఆర్ఎస్ రోడ్డు, బ్రాహ్మణవీధి, మెయిన్ బజారు, రైల్వే బ్రిడ్జి వరకు చిద్విలాసంగా ఊరేగారు. అమ్మవారిని చూసిన భక్తులు పులకరించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటి వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించి కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. తేరుపై అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

**దీలు, బోనాలు సమర్పణ**

మధ్యాహ్నం నుంచి కలికిరి పట్టణంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసి అమ్మవారికి దీలు, బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాంప్రదాయ వాయిద్యాలు, చెక్కభజనలు, బళ్ళారి డ్రమ్స్ తదితర వాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగింపుగా అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించారు. భక్తుల ఊరేగింపులతో కలికిరి పట్టణంలో భక్తివాతావరణం, భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలను కిక్కిరిశాయి. రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వివిధ ప్రాంతాల నుంచి చాందినీ బండ్లు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకోనున్నాయి. ఆలయ ప్రదక్షిణలు, అమ్మవారికి బలిదానం సమర్పణతో వర పడిన భక్తుల మొక్కులు తీరుతాయి.

**పటిష్ట బందోబస్తు**

కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, విఆర్ సీఐ రామాంజినేయులు ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్‌లు, పీసీలు, హోంగార్డులు మొత్తం 177 మంది సిబ్బంది జాతర బందోబస్తులో పాల్గొన్నారు. కలికిరి గాంధీ కూడలి నుంచి భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకుండా నిలువరించారు. రైల్వే బ్రిడ్జి ప్రాంతం నుంచి వాహనాల మళ్లింపుతో జాతరలో భక్తులకు ట్రాఫిక్ సమస్య తప్పింది.

**జాతరలో నేడు...**

జాతర ఉత్సవాలలో మూడవ రోజు సోమవారం అమ్మవారి సర్వదర్శనం, రాత్రికి లంకాదహనం కార్యక్రమం అనంతరం అమ్మవారు పుష్పపల్లకీ వాహనంలో పురవీధులలో ఊరేగుతారని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

### బీసీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

**తంబళ్లపల్లె:** కురబలకోట మండలం చేనేతనగర్‌లోని మహాత్మజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామాంజనేయరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లు బీసీ–1, బీసీ–బి–2,బీసీ–డి 2, ఎస్‌సి–1, ఎస్టీ –2, ఓసి (ఈబీసీ)–1 , 6వతరగతిలో బీసీ–ఎ 1, బీసీ–డి–1, ఎస్‌సి–1, ఎస్టీ–1, ఓసి (ఈబీసీ)–,1, 7వతరగతిలో బీసీ–ఎ 1, బీసీ–డి–1, 8వతరగతిలో ఎస్‌సీ–2, 9వ తరగతిలో ఎస్సీ–1, పిహెచ్‌సిలో 1 ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 18వతేదీలోపు ఆసక్తికలిగిన విద్యార్థులు పాస్‌పోర్టుసైజ్ ఫోటో, ఆధార్, స్టడీ సర్టిఫికెట్లతో పాఠశాలలో హాల్ టిక్కెట్లు పొందాలన్నారు. ఈనెల20వ తేదీన పాఠశాలలో ఉదయం 10.30 నుండి 12.30 వరకు రాత పరీక్షలు ఉంటుందన్నారు. వివరాలకు సెల్ నంబర్ 9346183057ను సంప్రదించాలన్నారు.

### క్రికెట్ టోర్నమెంట్ విన్నర్‌గా సీటీఎం క్రాస్‌రోడ్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న బండపల్లి అక్కులప్ప

**మదనపల్లె రూరల్ :** మండలంలోని సీటీఎం క్రీడామైదానంలో రెండురోజులుగా జరుగుతున్న ఎఫ్ఇసీసీ క్రికెట్ టోర్నమెంట్‌లో సీటీఎం క్రాస్‌రోడ్ జట్టు ట్రోఫీని కైవసం చేసుకుని విజేతగా నిలిచింది.హోరాహోరీగా జరిగిన ఎఫ్ఇసీసీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీల్లో సీటీఎం క్రాస్‌రోడ్ టీం 135 పరుగులతో విజేతగా నిలిస్తే... గొడసానివారిపల్లె టీం 107 పరుగులతో ఓటమి పాలై రన్నర్ అప్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆదివారం సాయంత్రం జరిగిన టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు బండపల్లి అక్కులప్ప ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్టు సీటీఎం క్రాస్‌రోడ్ కెప్టెన్ అనిల్‌కు విన్నర్ ట్రోఫీని అందజేశారు. రన్నర్ ట్రోఫీని గొడసానివారిపల్లె కెప్టెన్ రెడ్డిలకు అందించారు. టోర్నమెంట్‌లో మంచి ఆటతీరు కనపరిచిన ప్రశాంత్, హర్షలకు మెడల్స్‌ను బహుకరించారు. కార్యక్రమంలో మైఫోర్స్ డైరెక్టర్ శెట్టిపల్లె హరిబాబు, వినయ్‌కుమార్, శ్రీరాములు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

**–సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు**



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

**మదనపల్లె :** విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని దీన్ని ప్రజలు, కార్మికులు వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పిఎల్.నర్సింహులు పిలుపునిచ్చారు. ఆదివారం మదనపల్లిలో మున్సిపల్ స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ చార్జీల బాదుడు ప్రారంభమైందన్నారు. దీన్ని తిప్పి కొట్టేందుకు ప్రజా ఉద్యమమే పరిష్కారమని అన్నారు. కృష్ణా జిల్లాలోని గుడివాడ ఎన్టీఆర్ కాలనీవాసులు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తిరస్కరించారని గుర్తుచేశారు. ఇప్పటివరకు వాడుకున్న యూనిట్ల ప్రకారం విద్యుత్ చార్జీలు చెల్లిస్తున్నారని, రాబోయే రోజుల్లో స్మార్ట్ మీటర్ల వల్ల ప్రీపెయిడ్ రీచార్జ్ విద్యుత్ బిల్లులు ముందస్తుగానే చెల్లించాల్సి వస్తుందన్నారు. ట్రూ అప్, ఇంధన తదితర చార్జీల పేరుతో విద్యుత్ వినియోగం ఖరీదుగా మారుతుందని తెలిపారు. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో సీపీఐ జిల్లా 2వ మహాసభలు మదనపల్లెలో జరుగుతున్నాయని ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, జిల్లా సమితి సభ్యులు దేవా, ఉపాధ్యక్షుడు వాసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మస్తాన్, చలపతి నాయుడు పాల్గొన్నారు.

## బుద్ధునికొండను పరిశీలించిన డీఎస్పీ



బుద్ధునికొండను పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర, తాలూకా సీఐ కళా వెంకటరమణ

**మదనపల్లె రూరల్ :** బుద్ధ విగ్రహం ధ్వంసం కేసు విచారణలో భాగంగా ఆదివారం డీఎస్పీ మహేంద్ర, మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధునికొండను పరిశీలించారు. విచారణలో భాగంగా ఘటన జరిగిన రోజుకు సంబంధించి సెల్‌ఫోన్ సిగ్నల్స్ డంప్‌ను సేకరించామన్నారు. తాలూకా సీఐ వెంకటరమణను అడిగి కేసు ప్రగతిపై తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులను విచారించారు. కేసు దర్యాప్తులో భాగంగా అనుమానితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు.

## రెడ్డెమ్మ తల్లి ఆలయంలో భక్తుల రద్దీ



భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్న అమ్మవారి ఆలయం

**గుర్రంకొండ:** మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారికి ఉదయాన్నే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతానాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా పేరుపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలిరావడం విశేషం.

## తలసేమియా బాధిత బాలుడికి ఆర్థిక సాయం

**మదనపల్లె సిటీ:** మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె రాంరెడ్డిలేవుట్‌కు చెందిన హరిబాబు, గీంతాజలిల కుమారుడు చరణ్‌తేజ(12) తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు కె.రెడ్డి గణేష్ ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా ఫౌండేషన్ తరపున రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే వికాస్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శివశంకర్ తన వంతుకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7702080531ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు శశి,చరణ్, కర్ణా, హేమంత్ పాల్గొన్నారు.

## అన్నదాన ట్రస్టుకు మూడు ఎకరాల భూమి విరాళం



భూ డ్యాకుమెంట్లు ట్రస్టు సభ్యులకు అందజేస్తున్న దాత శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు

**తంబళ్లపల్లె:** మల్లయ్యకొండ శ్రీ మల్లికార్జునస్వామి సొషియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నదాన ట్రస్టుకు మూడు ఎకరాల భూమి విరాళంగా ఇచ్చారు. తంబళ్లపల్లెలోని గనముక్కల మునెమ్మ, సుబ్బరాయప్ప దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు శ్రీనివాసులు, మనవళ్లు శివరాయుడు, భరత్‌రాయుడులు ఆదివారం మూడు ఎకరాల భూమిని అన్నదానట్రస్టుకు విరాళంగా ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. భూమికి సంబంధించిన డ్యాకుమెంట్లు అన్నదానట్రస్టు సభ్యులకు అందజేశారు. వారు అన్నదానట్రస్టు అభివృద్ధికి సహకరించడం, వారి దానగుణానికి ట్రస్టు సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## కోటశ్రీనివాసరావుకు బీజేపీ నాయకుల నివాళి



కోట శ్రీనివాసరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**మదనపల్లె రూరల్ :** సీనియర్ నటుడు, మాజీ ఎమ్మెల్యే కోటశ్రీనివాసరావు మృతిపై బీజేపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో కోటశ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కోటశ్రీనివాసరావు మరణం బీజేపీకి, తెలుగుప్రజలకు తీరని లోటని బండి ఆనంద్ తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా పేరుతెచ్చుకోవడమే కాకుండా, రాజకీయరంగంలోనూ బీజేపీ ఎమ్మెల్యేగా ప్రజలకు తనదైన సేవలందించి మంచి గుర్తింపును తెచ్చుకున్నారన్నారు. నివాళులర్పించిన వారిలో పులి నరేంద్రకుమార్‌రెడ్డి, వరదారెడ్డి నారదరెడ్డి, పిల్లస్వామి నాయక్, టి.వెంకటరాజు, భగవాన్, పూలనాగరాజు, జర్మన్‌రాజు, దామోదర్, వెంకటేష్, బాలకృష్ణ, గోకుల్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కోటా శ్రీనివాసరావు మృతి తీరని లోటు**

**మదనపల్లె సిటీ:** సీనియర్ తెలుగు సినీ నటులు కోటా శ్రీనివాసరావు మృతి తీరని లోటని ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి అన్నారు. కోటా మృతి పట్ల ఆదివారం ఆయన సంతాపం ప్రకటించారు. సినీరంగంలో అనేక పాత్రలు పోషించి ప్రేక్షకుల ఆదారాభిమానాలు పొందారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి ప్రకటించారు.

## రైల్వే రాయితీ పాసుల కోసం పోస్టుకార్డుల ఉద్యమం



పది తరగతిలో ప్రతిభ కనబరిచిన నందకిషోర్ తల్లికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న సీనియర్ సిటిజెన్స్ సభ్యులు

**మదనపల్లె సిటీ:** సీనియర్ సిటిజెన్స్‌కు రైల్వేలో రాయితీ పాసులు పునరుద్ధరించాలని కోరుతూ పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టనున్నట్లు ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.మునిగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజెన్స్ సమావేశం జరిగింది. ఈవిషయం పార్లమెంటు సభ్యులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. సీనియర్ సిటిజెన్స్ సమస్యలపై జాతీయ,రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. సీనియర్ సిటిజెన్స్ సలహాదారులు గొల్లపూడి తిరుపతిరావుకి డాక్టరేట్ పట్టా అందుకున్నందుకు సన్మానించారు. పదో తరగతిలో జీఆర్టీ ఉన్నత పాఠశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థి నందకిషోర్ తల్లిదండ్రులకు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మునిరత్నం, కరుణాకర్, ఉస్మాన్‌సాహెబ్,టీఎస్ఎ క్రిష్ణమూర్తి, ధనలక్ష్మి, జగన్‌మోహన్ పాల్గొన్నారు.